


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -36-

(11' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**దేశంలో చాలా వస్తువులు** తక్కువగా వున్నాయనీ, అన్నిటి విషయంలో స్వయంసమృద్ధిగా వున్న విషయాలేమిటయ్యా అని ప్రశ్నించుకుంటే అల్లర్లు, అహంకారాలూ, అన్యాయాలూ, ధిక్కారాలూ, మోసాలూ, లంచగొండితనాలూ, దోపిడులు, హత్యలు దవుర్జన్యాలూ, పెద్దవాళ్ళ చుట్టూ భజనలు, ప్రణయ భజనలు, అర్ధ భోజనాలు ఇలాటివి కొన్నిటిని పేర్కొనవచ్చు.

వీటి అన్నిటినీ కొంచెంసేపు అవతల వుంచితే, దేశంలో ఇప్పుడు అమితంగా వండి ఒరిగి ఇతర దేశాలక్కూడా ఎగుమతి చేయడానికి చాలినంతగా వున్న సంపద తెలివి తేటలూ.

నిన్నటి మట్టి బుర్రలోంచి ఇవ్వాళ పట్టుకుచ్చులలాటి తెలివితేటలు పుట్టుకు వస్తున్నాయి. తెలియకుండా బుర్రల్లో భగవంతుడు ఏ రకం 'ఫెర్టిలైజర్సు' వేస్తున్నాడోగాని వెనక్కు తిరిగేటప్పటికి ఒక్కొక్క బుర్రలోకి వెయ్యి తెలివితేటల కంకులు పుట్టుకు వస్తున్నాయి.

కోసి, కుప్పలేసి, నూర్చిపోసేందుకు గిడ్డంగులు చాలడంలేదు. పైగా ఇంకో తమాషా జరుగుతోంది. అక్కడికీ ప్రతివాడూ పోనీ తెలివితేటల్ని దాచి ఎప్పుడైనా అవసరమొస్తే వాడుకుందాం. అవి దాచుకోకుండా ఎప్పటికప్పుడు వాడి పారేస్తున్నాడు.

మరి మానవకల్యాణానికి తోడ్పడాలనే కాంక్ష వుండటంలో తప్పేం వుంది? అందు వల్ల ఒకళ్ళు అడిగినా, అడక్కపోయినా, అవసరమనిపించినా మానినా తెలివి తేటల్ని వీలైనంతవరకు ఎక్కడో అడ గుమ్మరించి బుర్ర తేలిక చేసుకుందామని ప్రయత్నిస్తూనే వున్నాడు ప్రతి వ్యక్తి.

కానీ ఏం లాభం మళ్ళీ ఎప్పటిలాగా నిండిపోతున్నాయి. అందువల్ల నిత్య సమారాధన చెయ్యాల్సి వచ్చింది. కొందరు అలా చెయ్యడం వల్ల బరువు తగ్గడంలేదు. ప్రతిఫలం ఎక్కువగా దక్కడం లేదు. కనుక ఖర్చు ఎక్కువచేసి చూడటం మంచిదని, తెలివితేటలకు సంబంధించిన సప్తాహాలు ప్రారంభించేవారు.

రాత్రింబవళ్ళు నిర్విరామంగా నిర్నిద్రావకాశంగా తెలివితేటల్ని తోడిపోయడం అనే దీర్ఘజోకులు దిగిపోతున్నారు ఈ వదాన్యులు.

"ఎంత వాడితే అంతగా పుడుతున్నాయి తప్ప బరువు మాత్రం తగ్గడంలేదు. పరువెంతవరకు నిలుస్తున్నదో ఎవరికి వారే లెక్క చూచుకోవాలిగాని, వాటిని సరిచూడటానికి ఏ ఆడిట్ డిపార్టుమెంటూ పనికిరారు. పూర్వకాలంలో ఇన్ని తెలివితేటలు వుండేవి కావేమోననిపిస్తుంది. మా మల్లినాథ సూరిగారంటూ వుండేవారు. "ఈ కాలంలో వాళ్ళందరూ పెద్దవాళ్ళ

మెదడుతో పుడుతున్నారండి. అందుకని వాళ్ళు ఎదిగేదాకా తెలివితేటల కోసం ఆగవలసిన అవసరంలేకుండా పోతోంది" అని.

మరి ఎలా ఇలాటి తెలివి తేటలు పుడుతున్నాయో చెప్పడం కష్టం. తల్లి గర్భంలో వుండగానే శేముషి దురంధరులై పోతున్నారు. ఈ మా అంటే ఒకాయన అన్నాడు. "కాదుటండి మరి పూర్వకాలంలో కడుపుతోవున్న స్త్రీలు ఏ చలిమిడి వుండలో చప్పరిస్తూ, అరిసెలు కొరికి నములుతూ, చప్పుడు కాకుండా ఒకచోట కూర్చుని వుండేవారు. ఇంట్లో వున్న పెద్దవాళ్ళు గర్భిణి స్త్రీల ఎదుట అధిక ప్రసంగాలు చెయ్యనిచ్చేవారు కాదు. ఆర్భాటాలకు అసలే వీలులేదు. "

బయటికి వెడితే దిష్టి కొడుతుందని కొంప కదలనిచ్చేవారు కాదు. వీలైనంత వరకు విశ్రాంతి తీసుకొమ్మనేవారు. అలా వుండటంవల్ల గర్భంలో వున్న శిశువు శాంతంగా వుంటుందనేవారు. ఎవరైనా వాకిట్లోకి వచ్చిపోతే వెంటనే తలుపు దగ్గరవేసి రెండు గుప్పెళ్ళు ఉప్పు తీసిపారేసేవారు. వచ్చినవారి కళ్ళు ఫేమస్కళ్ళు అయితే మిరపకాయలదాకా వెళ్లేది దిష్టి.

అలాటిది ఇప్పుడేం వుంది. నీళ్ళు పోసుకున్నవాళ్ళకు పనులుండవు గనుక వీలైనంతవరకు అరుగుమీదే కాలక్షేపం. అరుగులు లేకపోతే హాలులో తిష్ఠ. ఎవరొచ్చినా లేవడం అంటూ లేదు. దానికో ఇబ్బంది కూడా వుందిగా. అందుకని వచ్చిన వాళ్ళు ముందుగానే కూర్చొమని బ్రతిమాలడం, అలాటి అవస్థ వుంటుందంటే అసలు హాలులోకే రాడుగదా.

అలా కూర్చున్నా కొంతవరకు ఫర్వాలేదు. రకరకాల పుస్తకాలు చదవడం డిటెక్టవులతో సహా. క్లబ్బులకు వెళ్ళడం, గందరగోళంలో పడటం, తర్వాత సినిమాలు చూడటం చిత్తవృత్తిని చిరాకులో నుంచి పరాకులోకి తెచ్చుకోవడం.

మరి అక్కడ సంభాషణలు, పాటలూ అన్నీ గర్భస్థులైవున్న శిశువులు ఆలోచిస్తున్నారో ఏమో, వాళ్ళకు పుట్టుకతోనే తెలివి తేటలు పుట్టుకొస్తున్నాయి.

ఒక కుర్రవాడి పేరు సుబ్బారావు అనుకోండి. వాడికి పుట్టుకముందు కొన్ని తెలివి తేటలు అబ్బుతున్నాయి.

వీరి తెలివి తేటల్ని రెండుగా విభజించవచ్చు. సుబ్బారావు పూర్వం (క్రీస్తు పూర్వం లాగా తెలివితేటలు సుబ్బారావు తర్వాత తెలివి తేటలు (క్రీస్తు శకంలాగా) అని మరి అలాకాకపోతే ఎనిమిదేళ్ళ కుర్రాడు సినిమా పాటలమీద అంత అభిమానం ఎందుకు చూపుతాడు. రూపాయి పెట్టి మిఠాయి కొనిపెడతానన్నా వినకుండా సినిమాకే వెడతానని ఎందుకు శటించి కూర్చుంటాడు. కనుక పుట్టుకకు పూర్వం కొంత 'జ్ఞానం' వీరు సంపాదించ కలుగుతున్నారనేది రూఢి అవుతోంది.

కనుక ఈరోజుల్లో వ్యక్తులకు తెలివి తేటలు అలా ఎక్కువగా లభిస్తున్నాయనడానికి సందేహం లేదు. పూర్వకాలంలో వాళ్ళలో తెలివితేటలు కావి.

ఆ రోజుల్లో తెలివితేటలు గలవారు "చెప్పింది వినిపించుకోవడం తెలియంది పని చేయడానికి సాహసించక పోవడం. ఒక పని చేయవలసినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించడం ఇత్యాదుల్లో తెలివి తేటలు వినియోగపడుతూ వుండేవి.

ఇంత చేసినా పూర్వకాలంలో పెద్దవాళ్ళు చిన్నవాళ్ళను మెచ్చుకునేవారు కాదు. ఎంత చేసినా 'సరేలే ఏదో కానియి' అనేవారు. కొంచెం పొరపాటు జరిగితే "నీ తెలివి తెల్లారినట్లే వుంది. ఏం చెప్పి ఏం లాభం, బుర్ర అంతవరకే, పెట్టాడు భగవంతుడు" అని నీళ్ళు నమిలేవారు.

ఇప్పటికాలంలో ఈ పప్పులేం వుడకడం లేదు. దీనికెలాటి సోడా ఉప్పువాడాలో పెద్దవాళ్ళకు తెలియడంలేదు.

Post your comments